Joyalukkas

## 'జోయాలుక్కాస్' దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 18: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోయాలుక్కాస్..దీపాళి పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'జోయ్ యొక్క దీపావళి' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్లు వచ్చే నెల 3 వరకు అందుబాటులో ఉంటాయని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జోయ్ అలుక్కాస్ తెలిపారు. లక్ష రూపాయలు అంతకంటే ఎక్కువ విలువ చేసే డైమండ్ & అన్ కట్ డైమండ్ జ్యువెలరీ కొనుగోలుపై ఒక గ్రాము గోల్డ్ కాయిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. రూ. 50 వేలు అంతకంటే ఎక్కువ విలువ చేసే గోల్డ్ & ప్రెషస్ జ్యువెలరీ కొనుగోళ్లపై రూ. 1,000 గిఫ్ట్ వోచర్, రూ. 10 వేలు అంతకంటే ఎక్కువ విలువ గల సిల్వర్ జ్యువెలరీ కొనుగోళ్లపై రూ. 500 గిఫ్ట్ వోచర్ కూడా పొందవచ్చని పేర్కొన్నారు. అంతేకాకుండా కస్టమర్లు కేవలం 10% ముందస్తు చెల్లింపుతో ప్రస్తుత గోల్డ్ రేట్‌కు లాక్ చేయవచ్చని వెల్లడించారు. షాపర్స్ తమ పాత గోల్డ్‌ను 100% హెచ్‌యూఐడీ 916 హాల్ మార్క్ కలిగిన జ్యువెలరీతో మార్చుకోవచ్చని సూచించారు.

# కెన్యాకు అదానీ షాక్!

## రెండింతలు కానున్న విద్యుత్తు చార్జీలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 18: కెన్యా వాసులకు కరెంట్ షాక్ గట్టిగానే తగలబోతున్నది. ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత సన్నిహితుడు గౌతమ్ అదానీకి చెందిన అదానీ ఎనర్జీతో కెన్యా ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందమే ఇందుకు కారణం. కెన్యాలో విద్యుత్తు లైన్ల ఏర్పాటు, కరెంట్ సరఫరా చేయడానికి అక్కడి ప్రభుత్వంతో 736 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఇటీవల కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం కెన్యా వాసులపై తీవ్ర ప్రభావం చూపనున్నది. ఈ ఒప్పందంతో ఇక్కడి ప్రజలకు ప్రాణసంకటంగా మారనున్నదని, ముఖ్యంగా విద్యుత్తు చార్జీలు రెండింతలు పెరిగే ప్రమాదం ఉన్నదని మీడియాలో కథనం ప్రచురితమైంది. విద్యుత్తు లైన్ల ఏర్పాటు, కరెంటు సరఫరా కోసం 30 ఏండ్లకు గానూ కెన్యా ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్(కెట్రాకో)తో అదానీ గ్రూప్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ప్రాజెక్టునకు సంబంధించి అదానీ గ్రూపు కెన్యా ప్రభుత్వానికి మొత్తం ప్రాజెక్టు వ్యయంలో ఒక్క శాతం 8 మిలియన్ డాలర్లు ఫీజు కింద చెల్లించనున్నది.

### గుజరాత్‌లో 102 శాతం పెరిగిన చార్జీలు

నరేంద్ర మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో విద్యుత్తు చార్జీలు భారీగా పెరిగాయి. గౌతమ్ అదానీకి చెందిన అదానీ పవర్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేయడం వల్లనే 2021 నుంచి 2022 మధ్యకాలంలో యూనిట్ చార్జీలు 102 శాతం పెరిగాయి. ఒక్కో యూనిట్ చార్జీ 2021లో రూ.3.58 ఉండగా, 2022 నాటికి ఇది రెండింతలు పెరిగి రూ.7.24కి చేరుకున్నది. ఈ విషయాన్ని స్వయాన ఆ రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి కను దేశాయ్ అసెంబ్లీలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో కెన్యాలో కూడా విద్యుత్తు చార్జీలు రెండింతలు పెరిగే అవకాశం ఉన్నదని అంచనా. ప్రస్తుతం యూనిట్ చార్జీ కెన్యా కరెన్సీ ఎస్‌హెచ్ 5.51గా ఉండగా, ఈ చార్జి రెండు రెట్లు పెరిగి ఎస్‌హెచ్ 11.14కి చేరుకోనున్నది. దీంతో అక్కడి సామాన్యుడిపై అదానీ పిడుగు పడ్డట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదానీకి చెందిన సంస్థలకు ప్రయోజనాలు కల్పించడానికి కెన్యా ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంలో అక్కడి ప్రజలు ఆందోళన బాటపట్టారు. ఇప్పటికే అదానీ-మోదీ బంధంపై ఆ దేశ మాజీ ప్రధాని ఒడింగా ప్రత్యేకంగా ఆరోపించగా..తాజాగా కిసిల్ సెనేటర్ రిచర్డ్ ఓన్యెయంకా అదానీ విద్యుత్తు ప్రాజెక్టుపై విమర్శలు గుప్పించారు.

### అదానీకి గుజరాత్ దాసోహం

గౌతమ్ అదానీకి గుజరాత్ ప్రభుత్వం దాసోహమైంది. ముఖ్యంగా విద్యుత్తు కొనుగోలుకు సంబంధించి అదానీ కంపెనీ చెప్పినట్లే విద్యుత్ చార్జీలను అమాంతం పెంచేసింది. జనవరి 2021లో ఒక్కో యూనిట్‌కు రూ.2.83 చెల్లించి అదానీ నుంచి కొనుగోలు చేసిన గుజరాత్ సర్కార్..ఆ మరుసటి ఏడాది చివరినాటికి ఇది రూ.8.83కి పెంచింది. అలాగే అదానీ నుంచి 2021లో 5,587 మిలియన్ల యూనిట్ల విద్యుత్తును కొనుగోలు చేసిన ఆ రాష్ట్ర సర్కార్..ఆ మరుసటి ఏడాది 7.5 శాతం పెరిగి 6,007 యూనిట్లకు పెంచుకున్నది. ఆ రెండేండ్లలోనే అదానీ పవర్‌కు రూ.8,160 కోట్ల చెల్లింపులు జరిపింది.


#### కెట్రాకోతో ఒప్పందం వివరాలు..

- పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిన అదానీ 400 కిలోవాట్ల ట్రాన్స్‌మిషన్ లైన్‌ను 208.73 కిలోమీటర్ల మేర గిల్జిల్ నుంచి కోంజా వరకు ఏర్పాటు చేయబోతున్నది.
- దీంతోపాటు 220 కిలోవాట్ల ట్రాన్స్‌మిషన్ లైన్‌ను రోంగై నుంచి కెరింజెట్ మీదుగా కెమోసిట్ వరకు 99.98 కిలోమీటర్ల మేర నెలకొల్పబోతున్నది.
- 132 కిలోవాట్ల ట్రాన్స్‌మిషన్ లైన్ మెనెంగై నుంచి రుమురుటి వరకు 89.89 కిలోమీటర్లు ఏర్పాటు చేయబోతున్నది.
- అలాగే 132/33 కిలోవాట్ల సబ్‌స్టేషన్‌ను నెలకొల్పడానికి అదానీ సిద్ధమవుతున్నది.
- ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత 24 నెలల్లో ఈ ప్రాజెక్టును అదానీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ ప్రాజెక్టును అదానీ గ్రూపు పూర్తి చేయకపోతే ఈ భారీ ఒప్పందాన్ని రద్దు చేసుకునే అవకాశం కెట్రాకోకు ఉంటుంది.
- ఈ భారీ ప్రాజెక్టుకు అయ్యే మొత్తం వ్యయం ఇరు సంస్థలు 70:30 నిష్పత్తిలో భరించనున్నాయి.

# అధిక వడ్డీరేట్లతో ఇక్కట్లే

## ఇండ్ల కొనుగోళ్లపై ప్రతికూల ప్రభావం

## ఫిక్కీ-అనరాక్ సర్వేలో వెల్లడి




ముంబై, అక్టోబర్ 18: అధిక వడ్డీరేట్లతో ఇక్కట్లేనని కొనుగోలుదారులు అభిప్రాయపడుతున్నారు. 9 శాతం కంటే అధికంగా వడ్డీరేట్లు ఉంటే ఇండ్ల కొనుగోలుపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయని సర్వేలో పాల్గొన్నవారిలో 90 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇండస్ట్రీ బాడీ ఫిక్కీ, రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ సంయుక్తంగా 'హోమ్‌బయర్ సెంటిమెంట్ సర్వే' పేరుతో నిర్వహించిన సర్వేలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సర్వేలో 7,615 మంది తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. ఫిక్కీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రమోద్ రావు మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ రంగంలో స్థిరమైన వృద్ధికి రెగ్యులేటరీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే పెట్టుబడిదారుల్లో నమ్మకం పెరగనుండటంతో దీర్ఘకాలికంగా ఇది మేలు చేయనున్నదన్నారు. ఫిక్కీ మాజీ అధ్యక్షుడు సందీప్ సొమెనీ మాట్లాడుతూ..దేశీయ రియల్ ఎస్టేట్ రంగం విప్లవాత్మక మార్పులు వచ్చాయని, సిద్ధంగా ఉన్న ఇండ్లను కొనుగోలు చేయడానికి కస్టమర్లు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ సర్వేలో పాల్గొన్న వారి అభిప్రాయాల ఆధారంగా ఒక నివేదికను రూపొందించింది. వీటి వివరాలు..

- 8.5 శాతం కంటే తక్కువ వడ్డీరేటు ఉంటే తమ ఇళ్ల కొనుగోలు నిర్ణయంపై ఎ లాంటి ప్రభావం చూపదని 71% మంది అభిప్రాయపడ్డారు.
- ఒకవేళ వడ్డీరేటు 9 శాతానికి పైకి చేరుకుంటే తమ నిర్ణయాన్ని వాయిదా వేసుకునే అవకాశం ఉన్నదని 87 శాతం మంది వెల్లడించారు.
- వడ్డీరేటు 8.5 శాతం నుంచి 9 శాతం మధ్యలో ఉంటే తమ నిర్ణయాన్ని పున: సమీక్షించుకునే అవకాశం ఉన్నదని 54 శాతం మంది చెప్పారు.
- పెట్టుబడులకు రియల్ ఎస్టేట్ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు 59 శాతం మంది వెల్లడించారు.
- రూ.40-90 లక్షల లోపు ధర కలిగిన ఇండ్లను కొనుగోలు చేయడానికి 35 శాతం మంది ఆసక్తి చూపారు. అలాగే రూ.90 లక్షల నుంచి రూ.1.5 కోట్ల లోపు ధర కలిగిన ఇండ్ల కొనుగోలుకు 28 శాతం మంది ఇంట్రెస్ట్ చూపారు.

# భగ్గుమన్న బంగారం

## రూ. 80వేలకు చేరువైన తులం పుత్తడి



న్యూఢిల్లీ, అక్టోబర్ 18: బంగారం భగభగమండుతున్నది. సామాన్యుడికి అందనంత స్థాయిలో దూసుకుపోతున్నది. దేశీయంగా పండుగ సీజన్‌కు తోడు అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో ధరలు పరుగెడుతున్నాయి. రోజుకొక రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న ధరలు శుక్రవారం మరో చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.80 వేలకు చేరువైంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన తులం బంగారం ధర రూ.79,900 పలికింది. గురువారం ముగింపుతో పోలిస్తే తులం ధర రూ.550 ఎగబాకినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. వరుసగా మూడు రోజులుగా పెరుగుతూ వచ్చిన ధరలు ఆల్‌టైం హైకీ చేరుకున్నాయి. అటు ఫ్యూచర్ మార్కెట్లోనూ అదే జోరు కనబడింది. డిసెంబర్ నెల డెలివరీకి గాను పదిగ్రాముల ధర రూ.77,620 వద్ద నిలిచింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ ఫ్యూచర్ ధర రికార్డు స్థాయి రూ.77,667 పలికింది. ఇటు హైదరాబాద్‌లో బంగారం మరింత బలపడింది. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.870 అధికమై రూ.78,980కి చేరుకున్నది. ధరలు పెరగకముందు ఇది రూ.78,100గా ఉన్నది. 22 క్యారెట్ల పదిగ్రాముల పుత్తడి ధర రూ.800 ఎగబాకి రూ.72,400కి చేరుకున్నది. ఇతర నగరాల్లోనూ ధరలు గరిష్ఠ స్థాయిలో నమోదయ్యాయి.

### వెండిది అదే దారి

బంగారంతో పాటు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్ళు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,000 అధికమైంది. దీంతో ధర రూ.93,500 నుంచి రూ.94,500 పలికింది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.2000 ఎగబాకి రూ.1,05,000 పలికింది. ఎంసీఎక్స్ మార్కెట్లో డిసెంబర్ డెలివరీ రూ.1,231 లేదా 1.34 శాతం బలపడి రూ.92,975 పలికింది.

### పండుగ జోష్ వల్లనే..

దేశవ్యాప్తంగా పండుగ సీజన్ కావడంతో కొనుగోలుదారులు ఎగబడి కొనుగోళ్లు జరుపుతున్నారు. దసరా సీజన్ ముగిసినప్పటికీ వచ్చేది దీపావళి కావడంతో అత్యధికంగా అమ్మకాలు జరుగుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు. మరోవైపు, అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొనడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా ధరలు పెరగడానికి మరో కారణమన్నారు. ప్రస్తుతం రికార్డు స్థాయికి చేరుకున్న ధరలతో కొనుగోళ్లు శ్రేయస్కరం కాదని సూచనప్రాయంగా చెబుతున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు కూడా మదుపరుల్లో అప్రమత్తత పెంచింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 24.30 డాలర్లు ఎగబాకి 2,731.15 డాలర్లకు, వెండి 32.72 డాలర్లు పలికింది.

## తెలుగు రాష్ట్రాలపై గోద్రెజ్ క్యాపిటల్ ఫోకస్

హైదరాబాద్, అక్టోబర్ 18: గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూపునకు చెందిన ఆర్థిక సేవల సంస్థ గోద్రెజ్ క్యాపిటల్..తెలుగు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రూ.500 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేసిన సంస్థ..వచ్చే మార్చి నాటికి రూ.800 కోట్లకు పెంచుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో మనీష్ షా తెలిపారు. ప్రస్తుతం సంస్థ ఎంఎస్ఎంఈ, ఎస్ఎంఈలకు రుణాలు ఇస్తుండగా, వచ్చే రెండు నుంచి మూడేండ్ల కాలంలో తెలుగు రాష్ట్రాల్లో గృహ రుణాలు కూడా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. డెయిరీ ఫామ్‌లకు కూడా రుణాలను మంజూరును ఇటీవల ప్రారంభించినట్లు, ఇందుకోసం క్రీమ్‌లైన్ డెయిరీ ఉత్పత్తుల సంస్థతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు చెప్పారు.

## కరిగిపోతున్న విదేశీ నిల్వలు

ముంబై, అక్టోబర్ 18: విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. వరుసగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ఫారెక్స్ రిజర్వులు గత వారాంతానికిగాను 700 బిలియన్ డాలర్ల దిగువకు పడిపోయాయి. ఈ నెల 11తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 10.746 బిలియన్ డాలర్లు తరిగిపోయి 690.43 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. గతవారంలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 10.542 బిలియన్ డాలర్లు తగ్గి 602.101 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అలాగే పసిడి రిజర్వులు 98 మిలియన్ డాలర్లు తగ్గి 65.658 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.

## ఐటీ ఎగుమతుల్లో జీసీసీలు కీలకం

### మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు పెరగడంలో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు కీలక పాత్రను పోషిస్తాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం టీ హబ్‌లో నిర్వహించిన జీసీసీ ఇన్నోవేషన్ సమ్మిట్-2024 కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. స్టార్టప్ ఎకోసిస్టంలో టీ హబ్ ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నదని కొనియాడారు.టీ హబ్ తాతాల్కిక సీఈవో సుజిత్ జాగీర్దార్, రాష్ట్ర ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.



## స్కిల్ వర్సిటీకి అదానీ గ్రూప్ 100 కోట్ల విరాళం

### సీఎం రేవంత్‌కు చెక్కు అందించిన చైర్మన్ గౌతమ్ అదానీ

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ రూ. 100 కోట్ల విరాళం ఇచ్చింది. శుక్రవారం గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి చెక్కును అందజేశారు.

### అక్కడ మోదాని.. ఇక్కడ రేవ్దాని?

ప్రధాని మోదీ, అదానీ బంధాన్ని మోదానిగా ఏఐసీసీ పేర్కొన్న నేపథ్యంలో తెలంగాణలో అదానీ, రేవంత్‌రెడ్డి జంటను ఏమని పిలవాలి? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఏఐసీసీ ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ ఫొటో కింద.. ఈ రోజు ప్రశ్న అనే శీర్షికన 'మోదీజీ అదానీ కీ ఏజెంట్ హై? అని ప్రశ్నిస్తూ.. ఏ: అవును, బీ: అనుమానమే లేదు, సీ: బిల్‌కుల్, డీ: పైవన్నీ అనే నాలుగు ఆప్షన్లు ఇచ్చింది. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ.. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి, అదానీ ఫొటోను ట్యాగ్ చేసి ఈ జంటను ఏమని పిలుద్దాం? అని ప్రశ్నించారు. రేవంత్+అదానీ = రేవ్దానీ, రా..జీ+అదాని+రాగ్దానీ అంటూ ఎద్దేవా చేశారు.

## తొమ్మిది వర్సిటీలకు నూతన వీసీలు

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని తొమ్మిది యూనివర్సిటీలకు నూతన వైస్‌చాన్స్‌లర్లు నియమితులయ్యారు. వీరి నియామకానికి గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ శుక్రవారం ఆమోదం తెలిపినట్టు రాజ్‌భవన్ ప్రకటనలో తెలిపింది. మహాత్మా గాంధీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ రెండో పర్యాయం వీసీగా ఎంపికయ్యారు. మిగతా వారంతా కొత్తవారే కావడం విశేషం. వర్సిటీలకు ఐదు నెలలుగా రెగ్యులర్ వీసీలు లేరు. ఇన్‌చార్జి వీసీలతోనే నెట్టుకొస్తుండగా, తాజాగా వీసీలను నియమించారు.

| వీసీ పేరు | యూనివర్సిటీ | ప్రస్తుత హోదా |
|---|---|---|
| ఎం కుమార్ | ఉస్మానియా | ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో సీనియర్ ప్రొఫెసర్ |
| వెలుదండ నిత్యానందరావు | తెలుగు యూనివర్సిటీ | రిటైర్డ్ ప్రొఫెసర్ |
| ఖాజా అల్తాఫ్ హుస్సేన్ | మహాత్మాగాంధీ యూనివర్సిటీ, నల్లగొండ | కాకతీయ వర్సిటీలో ఫిజిక్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ |
| జీఎన్ శ్రీనివాస్ | పాలమూరు యూనివర్సిటీ, మహబూబ్‌నగర్ | జేఎన్టీయూ ఈఈఈ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్, యూజీసీ, ఎంఎంటీటీసీ డైరెక్టర్ |
| యూ ఉమేశ్‌కుమార్ | శాతవాహన యూనివర్సిటీ, కరీంనగర్ | ఓయూ కెమిస్ట్రీ విభాగం హెచ్‌వోడీ |
| కే ప్రతాప్‌రెడ్డి | కాకతీయ యూనివర్సిటీ, వరంగల్ | ఓయూ జువాలజీ విభాగం, రిటైర్డ్ ప్రొఫెసర్ |
| టీ యాదగిరిరావు | తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్ | కాకతీయ వర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ |
| అల్దాస్ జానయ్య | ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్ | రిటైర్డ్ ప్రొఫెసర్ |
| డీ రాజిరెడ్డి | శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వర్సిటీ | రిటైర్డ్ ప్రొఫెసర్ |

# మద్యం మాఫియా గుప్పిట్లో ఎక్సైజ్

- అక్రమ మద్యం తయారీని పట్టుకున్న ఐఏఎస్ అధికారిణి
- రెండు డిస్టిలరీల్లో ఆకస్మిక తనిఖీలు.. గుట్టు రట్టు
- ఖజానాకు 100 కోట్ల నష్టం
- ఆ అధికారిణి లేఖతో ఉలిక్కిపడిన ముఖ్య నేతలు
- అధికారిణి ఆకస్మిక బదిలీ
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి పన్ను ఎగవేసేందుకు అక్రమంగా మద్యం తయారుచేసి దొంగచాటుగా విక్రయిస్తున్న రెండు డిస్టిలరీల మీద ఓ ఐఏఎస్ అధికారిణి దాడులు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ అధికారిణి అక్కడ దొరికిన తీగ లాగగా మద్యం మాఫియా డొంకంతా కదిలినట్టు తెలిసింది. అక్రమంగా తయారుచేస్తున్న ఎన్‌డీపీఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్)ను డిస్టిలరీల నుంచి నేరుగా మద్యం దుకాణాలకు, అక్కడి నుంచి బెల్టు షాప్‌లకు తరలిస్తున్న వైనాన్ని ఆమె పసిగట్టినట్టు సమాచారం. కేవలం మూడు నెలల్లోనే రెండు లిక్కర్ కంపెనీల ద్వారా రూ.100 కోట్ల విలువైన అక్రమ మద్యం వ్యాపారం సాగినట్టు ఆమె అంచనాకు వచ్చారని తెలిసింది. దీనిపై ఆమె ఎక్సైజ్‌శాఖకు లేఖ రాయడంతో లిక్కర్ మాఫియా ఉలిక్కిపడటం, వారు వెంటనే ఓ 'ముఖ్య'నేతను కలవడం, వారం రోజుల్లోనే ఆ అధికారిణిని బదిలీ చేసినట్టు అధికారవర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది.



### తీగ లాగిన వైనమిదీ

సదరు అధికారి తన శాఖ అధికారులతో కలిసి ఎక్సైజ్ రాబడి మీద సమీక్ష చేసినప్పుడు పలు అనుమానాలు రావడంతో లిక్కర్ అమ్మకాలపై నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో గత మే నెలలో రెండు డిస్టిలరీల మీద దాడి చేశారు. రికార్డులను ఆడిట్ చేశారు. ఆ రెండు డిస్టిలరీలలో అనుమతించిన లిక్కర్ ఉత్పత్తికి వాడిన నీరు, కరెంటు, ముడిసరుకు లెక్కలను పోల్చి చూస్తే..! భారీగా తేడాలు ఉన్నట్టు గుర్తించారు. ఆ కంపెనీ మరో డిస్డిలరితో కలిపి ఏడాదికి 1.30 కోట్ల లీటర్ల మద్యం ఉత్పత్తికి అనుమతి తీసుకున్నాయి. దాడి చేసే సమయానికి మూడు నెలల కాలాన్ని పరిగణనలోకి తీసుకొని రికార్డులను పరిశీలిస్తే.. అనుమతించిన మద్యం కంటే 12.50 లక్షల లీటర్లు అదనంగా ఉత్పత్తి జరిగినట్టు గుర్తించారు. దీని విలువ రూ.100 కోట్లుగా అంచనా వేశారు. వివరాలతో ఆ అధికారిణి ఎక్సైజ్‌శాఖకు లేఖ రాశారు. రెండు డిస్టిలరీలలో అక్రమ మద్యం వ్యాపారం జరుగుతున్నదని దీంతో 70 శాతం వ్యాట్ కింద సర్కార్‌కు రావాల్సిన రూ.90 కోట్లు వరకు గండి పడినట్టు తెలిపారు.

### తనిఖీల్లో అక్రమాలు బట్టబయలు

ఈ లేఖతో ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించగా ఒక డిస్టిలరీలో అక్రమ మద్యంను గుర్తించినట్టు సమాచారం. ఇందుకు బాధ్యులుగా ఇద్దరు సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు ఎక్సైజ్ సీఐలపై క్రమశిక్షణ చర్యలు తీసున్నది. ఇదే అంశాన్ని ఎక్సైజ్ శాఖ కమిషనర్ సదరు అధికారికి జవాబు రూపంలో రాశారు. ఈ జవాబుపై సంతృప్తి చెందని అధికారిణి, శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు అవసరం లేదని, ప్రభుత్వ ఆదాయానికి ఎంత గండి పడ్డదో ? డిస్టిలరీల వారీగా వివరాలు పంపాలని ఎక్సైజ్ శాఖకు మరో లేఖ రాశారు.

#### అధికారిణిపై బదిలీవేటు

అధికారిణి దూకుడుతో రాష్ట్రంలో భారీ అక్రమ మద్యం కుంభకోణం బయటపడే అవకాశం ఉండటంతో ఎక్సైజ్ అధికారులు, డిస్టిలరీల యాజమాన్యం అప్రమత్తం అయ్యారు. అక్రమ మద్యం ఉత్పత్తి, వ్యాపారానికి ఒడిగట్టిన మద్యం మాఫియా వెళ్లి రాష్ట్ర ముఖ్యనేతను, మరో కీలక నేతను కలిసి ప్రసన్నం చేసుకున్నట్టు తెలిసింది. మాఫియా లాబీయింగ్‌తో సదరు ఐఏఎస్ అధికారిణిని అకస్మికంగా అక్కడి నుంచి వేరొక శాఖకు బదిలీ చేశారు. తాజాగా జరిగిన ఐఏఎస్‌ల పోస్టింగుల సర్దుబాటులో సదరు అధికారిణికి మరో శాఖకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. అధికారిణి బదిలీతో మద్యం అక్రమ వ్యాపారం విచారణను మ మ అనిపించి ఫైల్‌ను సంపూర్ణంగా అటకెక్కించినట్టు సమాచారం.

## కోర్సుల్లేని వర్సిటీకి వీసీగా సాంకేతిక విద్య ప్రొఫెసర్

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): పాలమూరు వర్సిటీ వీసీ నియామకంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ట్రిపుల్ ఈ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జీఎన్ శ్రీనివాస్‌ను ప్రభుత్వం పాలమూరు వర్సిటీ వీసీగా నియమించింది. అయితే పాలమూరు వర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సులను నిర్వహించడంలేదు. ఇలా ఇంజినీరింగ్ కోర్సుల్లేని వర్సిటీకి, సాంకేతిక విద్య ప్రొఫెసర్‌ను వీసీగా నియమించడమేంటన్న అభ్యంతరాలొస్తున్నాయి. కాగా, రాష్ట్రంలో కీలకమైన జేఎన్టీయూ వైస్‌చాన్స్‌లర్ నియామకాన్ని ప్రభుత్వం పక్కనపెట్టింది. తాజాగా 9 వర్సిటీలకు వీసీలను నియమించగా, జేఎన్టీయూకు మాత్రం వీసీని నియమించలేదు. అయితే ఈ వర్సిటీ వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ సిఫారసులను ప్రభుత్వం పక్కనపెట్టినట్టు తెలిసింది. జేఎన్టీయూతోపాటు బీఆర్ అంబేద్కర్, జేఎన్ఎఫ్ఏయూలకు వీసీలను నియమించాల్సి ఉంది. వీసీల నియామకంలో సామాజిక సమతూకంలో పించిందన్న ఆరోపణలొస్తున్నాయి. ఎస్టీల్లో ఆదివాసీ, ఎస్సీల్లో మాల సామాజికవర్గాలకు చోటు కల్పించలేదు. తాజా వీసీల్లో ముగ్గురు బీసీలు, ఇద్దరు రెడ్డి, ఒక వెలమ, ఒక బ్రాహ్మణ, ఒక ఎస్సీ, ఒక మైనార్టీలకు చోటు కల్పించింది. మహిళా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా ఎస్టీ లంబాడా, ఆర్జీయూకేటీ ఇన్‌చార్జీ వీసీగా ఎస్సీ సామాజిక వర్గాలకు అవకాశం కల్పించారు.

## తెలంగాణలో స్కూళ్లు తెరిస్తే.. కర్ణాటకలో మూత

- తెలంగాణలో ఐదేండ్లల్లో పెరిగిన 554 సర్కారు స్కూళ్లు
- కర్ణాటకలో మూతపడిన 309 సర్కారు స్కూళ్లు

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తేతెలంగాణ): తెలంగాణలో కేసీఆర్ పాలనలో విద్యావ్యవస్థ నాశనమైంది.. ఇది తరుచూ కాంగ్రెస్ నేతలు వల్లించే మాటలు. కానీ శుద్ధ అబద్ధం. ఇదే విషయాన్ని కేంద్రం గతంలోనే పార్లమెంట్ వేదికగా అనేకసార్లు ప్రకటించింది. ఆయా వివరాలను పార్లమెంట్ ముందుంచింది. ఈ వివరాలను పరిశీలిస్తే... తెలంగాణలో కొత్తగా సర్కారు స్కూళ్లు తెరిస్తే.. కాంగ్రెస్ ఏలుబడిలో స్కూళ్లు మూతబడ్డట్టు స్పష్టమైంది. 2014-15లో తెలంగాణలో 29,268 స్కూళ్లు ఉండగా, 2015-16లో వీటి సంఖ్య 29,127కు చేరింది. ఇక 2018-19కి వచ్చే సరికి సర్కారు స్కూళ్ల సంఖ్య 29,822కు పెరిగింది. అంటే ఐదేండ్లల్లో 554 సర్కారు స్కూళ్లు పెరగాయి. అదే కాంగ్రెస్ పాలనలోని కర్ణాటకలో 2014-15లో 50,493 సర్కారు స్కూళ్లు ఉండగా, 2015-16లో 50,424కు పడిపోయింది. అంటే ఒక్క ఏడాదిలో 69 స్కూళ్లు మూతపడ్డాయి. ఇక 2018-19లో ఈ స్కూళ్ల సంఖ్య 50,184కు తగ్గింది. ఈ ఐదేండ్ల కాలంలో 309 స్కూళ్లు మూతపడ్డాయి. విద్యావ్యవస్థను ఎవరు నాశనం చేశారో తెలుసుకునేందుకు ఈ వివరాలు చాలంటూ పలువురు నెటిజన్ల పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## కొడంగల్‌కు 43.75 కోట్లు విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): కొడంగల్ ఏరియా అభివృద్ధి అథారిటీ (కాడా)కి రాష్ట్ర ప్రభుత్వం రూ.43.75 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం కాడా చైర్మన్, వికారాబాద్ కలెక్టర్‌కు రూ.43.75 కోట్లు విడుదలయ్యాయి. కాడా పథకం కోసం 2024-25 బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధుల నుంచి ఈ మొత్తం విడుదల చేశారు.

## హామీలపై 21లోగా తేల్చాలి: ఉద్యోగుల జేఏసీ

- 22న కార్యాచరణ ప్రకటిస్తాం

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని 9 హామీలతోపాటు ఉద్యోగుల 41 డిమాండ్లపై 21లోగా ఏదో ఒకటి తేల్చాలని ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేసింది. లేకపోతే 22న కార్యాచరణ ప్రకటిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావొస్తున్నా ఒక్క సమస్య పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులంతా అసంతృప్తిగా ఉన్నారని జేఏసీ నేతలు శుక్రవారం వెల్లడించారు. సచివాలయంలో సీఎంవో కార్యదర్శి శేషాద్రిని కలిసి నోటీసు అందజేశారు. ఆ తర్వాత నాంపల్లి టీఎన్జీవో భవన్‌లో జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడుతూ.. తమ 50 డిమాండ్లపై ప్రభుత్వాన్ని, మంత్రులను కలిసి వినతిపత్రాలిచ్చినా సానుకూల స్పందన కరువైందని ఆవేదన వ్యక్తంచేశారు. వరద బాధితులకు సహాయం ప్రకటించిన రోజు, రెండు మూడు రోజుల్లోనే సమస్యల పరిష్కారానికి విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా ప్రభుత్వం నుంచి ఎలాంటి పిలుపురాకపోవడం బాధాకరమని వాపోయారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీనివాసరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ శ్రీపాల్‌రెడ్డి, సదానందంగౌడ్, అంజిరెడ్డి, శ్యామల్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు సుద్దాల దంపతుల జాతీయ పురస్కారాల ప్రదానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కారాల ప్రదానాన్ని శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నారు. వాల్‌పోస్టర్‌ను విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది అవార్డును అరుణోదయ నాగన్నకు అందజేయనున్నారని చెప్పారు.

## విదేశీ విద్యా నిధులు విడుదల చేయండి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబర్18 (నమస్తే తెలంగాణ): విదేశీ విద్యానిధి పథకానికి ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు గత ప్రభుత్వం ఓవర్సీస్ స్కీమ్‌ను ప్రవేశపెట్టి, రూ.20లక్షల వరకు ఆర్థికసాయం అందించిందని గుర్తుచేశారు. పథకం ద్వారా ఎంపికైన అనేకమంది ప్రస్తుతం విదేశాల్లో చదువుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ విద్యార్థులంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు.

## మళ్లీ పోరుబాటకు గురుకుల జేఏసీ

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో తలెత్తిన సమస్యల పరిష్కారానికి మళ్లీ పోరుబాట పట్టే ప్రయత్నంలో గురుకుల టీచర్ల జేఏసీతో పాటు టీఎస్ యూటీఎఫ్ ప్రణాళికలు రూపొందిస్తున్నది. దసరా ముందు పోరుబాట పట్టిన టీచర్లు సెలవుల్లో బ్రేక్ వేశారు. ప్రస్తుతం సెలవులు ముగియడంతో మళ్లీ పోరుబాట పట్టడానికి కార్యాచరణ రూపొందించే యత్నాలు చేస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చావ రవి తెలిపారు.

## విద్యాకమిషన్‌కు ముగ్గురు కొత్త సభ్యులు

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ విద్యా కమిషన్‌కు ముగ్గురు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, చారకొండ వెంకటేశ్, కే జ్యోత్స్నశివారెడ్డిని కమిషన్ సభ్యులుగా నియమించింది. ఇప్పటికే కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని నియమించింది. కొత్త సభ్యుల నియామకంతో కమిషన్ పూర్తిస్థాయిలో కొలువుదీరినట్లైంది.